
# మాడిన సరుకు

రోజూ ఆఫీసు నుండి రాగానే స్నానాదికాలు ముగించుకొని ఇంటి టెర్రస్ మీద కూర్చుని రిలాక్స్ అవటం యాదగిరికి అలవాటు. మల్కాజ్‌గిరిలో ఇల్లు కట్టి ఆరేడేళ్ళయింది. అప్పటినుంచి ఇదే అలవాటు. అప్పట్లో అయితే కొంచెం ఎత్తులో వున్న తన ఇంటి మీద నుంచి చెట్లూ, పచ్చటి భూములూ, వచ్చే పోయే రైళ్ళూ అన్నింటినీ మించి మౌలాలీకొండ, దాని వెనక నుంచి కన్పించే సూర్యుడు అదంతా ఒక సుందర దృశ్యంలా వుండేది. ఇప్పుడు హైదరాబాద్‌లో వున్న జన సాంద్రతంతా మల్కాజ్‌గిరిలోనే వున్నట్టు అడుగడుక్కీ ఇళ్ళు వెలిశాయి. నేల చాలక పుట్టగొడుగుల్లా పెరుగుతున్న అపార్ట్‌మెంట్స్ మౌలాలీకొండనీ, దాని వెనుకనుంచి కన్పించే సూర్యుణ్ణీ ఎప్పుడో అడ్డగించేశాయి.



కాని, సుందర ప్రకృతి దృశ్యం అదృశ్యం అయినందుకు అతనంతగా బాధపడడం లేదు. తన ఇంటి సమీపంలో మౌలాలీకొండను పూర్తిగా మూసివేస్తూ తన స్నేహితుడు యశ్వంతరావు ఓ అరవై డబ్బై అపార్ట్‌మెంట్స్ కట్టిస్తున్నాడు. రెండు కోట్ల ప్రాజెక్టు. అదే అతని బాధకు ఈర్ష్యకు కారణం.

యాదగిరి వృత్తిరీత్యా సివిలింజనీరు. రాష్ట్రప్రభుత్వోద్యోగం. మామగారి రాజకీయపు అండ, నల్ల ధనమూ అన్నీ వున్నా ఈ ప్రభుత్వ ఉద్యోగాన్ని వదలి ధైర్యం చేసి అలాంటి ప్రాజెక్టు చేపట్టలేకపోతున్నాడతను. ఏదో ఒకరోజు ఉద్యోగం వదలి కాంట్రాక్టర్‌గా మారినా ఆశ్చర్యం లేదు.

ఆ అపార్ట్‌మెంట్ నిర్మాణం ఓ పెద్ద ఇండస్ట్రీ సాగుతున్నట్టుగా వుంటుంది. వచ్చేపోయే లారీలు, గిరగిరా తిరిగే కాంక్రీటు మిషనూ, తట్టలు మోసే పనివాళ్ళూ– ఈ కోలాహలమంతా అతని మస్తిష్కంలో ఇటువంటి ప్రాజెక్టులు నాలుగైదు చేపట్టి ఎప్పుడు ఎడాపెడా సంపాదించాలా అని అలజడి రేపుతూ వుంటుంది. సరిగా అదే సమయానికి చెంగారెడ్డి వస్తాడు. ఇద్దరూ కలిసి రెండు పెగ్గులు విస్కీ బిగిస్తే గాని ప్రశాంతంగా వుండదు. అప్పుడప్పుడూ బిల్డర్ యశ్వంతరావు కూడా జాయినవుతూ వుంటాడు.

అయితే చెంగారెడ్డి ఇంకా రాలేదు. అతనికోసం చకోర పక్షిలా– కాదు కింగ్ ఫిషర్ పక్షిలా – గ్లాసులూ, సీసాలూ, అయిసుతో ఎదురు చూస్తున్నాడు.

అతని ఎదురు చూపుల్ని అడ్డగిస్తూ ఎదురుగా నిర్మాణంలో వున్న కాంప్లెక్స్ రెండవ అంతస్తు నుండి పెద్ద దూలం ఒకటి పెళ్ళున ఊడి అక్కడే క్రిందుగా పనిచేస్తున్న ఓ ముసలావిడ నడుం మీద పడడం, అమ్మా అని మూలుగుతూ ఆమె నడుం విరిగి పడిపోవడం, అక్కడ చుట్టుప్రక్కల పనివాళ్ళు గుమికూడడం వెంటవెంటనే జరిగిపోయాయి. ఒకసారి చూసి వద్దామని అతను మెట్లుదిగి వచ్చి గేటు తీసుకొని బయటకు వచ్చేసరికి ఆమెను అక్కడి వాళ్ళు ఆటో ఎక్కిస్తున్నారు, ఆస్పత్రికి తీసుకువెళ్ళడానికి. దగ్గరగా వెళ్ళి చూస్తూ "ఏం ప్రమాదం లేదు గదా" అంటుంటే ఆ ముసలావిడ నొసటి ముడతలు ఎక్కడో చూసినట్టుగా అన్పించాయి. ఆటో బయలుదేరి వెళ్తుంటే 'ఈవిడ పేరేమిటి?' అనడిగాడు మిగిలిపోయిన వాళ్ళని.

"అచ్చక్క".

** ** **

యాదగిరి అంతుచిక్కని ఆలోచనలతో వెనక్కి వచ్చేసరికి చెంగారెడ్డి "ఏంరా! నేనొచ్చేసరికి నాలుగైదు పెగ్గులు లాగేసినట్లుగా వున్నావే" అని పలకరించాడు.

చెంగారెడ్డికి ఈ దేశంలోనే తయారు చేసి, ఈదేశంలో తప్పించి ఏ దేశంలోనైనా అమ్ముకోవాలని ప్రభుత్వం ప్రత్యేకంగా అనుమతించిన గ్రానైట్ రాళ్ళ పరిశ్రమ వుంది. ధన బలాన్నీ, స్థానిక పలుకుబడినీ ఉపయోగించి జిల్లాలో ముప్పై అయిదేళ్ళకు ఎమ్మెల్యే పదవికి కూడా పోటీ చేశాడు. తన పార్టీకి అధికారం లభించినా అతని దురదృష్టం అతను గెలవలేదు. అయినా అధికార పార్టీలో తిరుగులేని పలుకుబడి వుంది.

చెంగారెడ్డి పలకరింపునీ, పరిసరాల్నీ పట్టించుకోనట్టుగా కుర్చీలో కూలబడ్డ

— సంకా ప్రసాద్

యాదగిరి "అరె చెంగా, నీకు అచ్చక్క గుర్తుందిరా?" అనడిగాడు.

"అచ్చక్క ఎవ్వర్రా? ఏవూరు?" అడిగాడు చెంగారెడ్డి విస్కీ గ్లాసులో పోసి అయిస్ క్యూబ్స్ వేస్తూ.

"దళంలో అచ్చక్కరా, గుర్తురా లేదా?"

గుర్తొచ్చింది చెంగారెడ్డికి.

** ** **

అవి హైదరాబాద్‌లో యాదగిరీ, చెంగారెడ్డి కాలేజీలో చదువుతున్న రోజులు. అడిక్‌మెట్‌లో ఇద్దరూ, ఇంకో ఇద్దరు మిత్రులు రాజు, రహమాన్‌తో కలసి వుంటుండేవాళ్ళు. అవి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ, వరంగల్ ఆర్.యి.సీ.లోనూ సామ్యవాద భావాల ప్రభావం ప్రబలంగా వున్న రోజులు. ఈ రెండు విద్యా సంస్థలూ



"తీవ్రవాదుల తయారీ కేంద్రాలు"గా పోలీసులు గుర్తించిన రోజులు. అయితే అప్పట్లో చాలామంది విద్యార్థులలాగే వీళ్ళది కూడా– మార్క్స్, ఎంగెల్స్ సిద్దాంత బలంపై నమ్మకం కంటే సమత, సౌభ్రాతృత్వం, దోపిడీ లేని సమాజం అనే గమ్యాల పైన భావావేశం, లెనిన్, మావో జీవిత చరిత్రలు ఇతర గెరిల్లా పోరాటాలూ చదివి ప్రభావితమైన 'రొమాంటిక్ కమ్యూనిజం.' అడిక్‌మెట్ ఉస్మానియాకి బాగా దగ్గర్లో వుండడం వల్ల అక్కడ పోలీసులు దాడి జరిపినప్పుడల్లా అక్కడి విద్యార్థి నాయకులు పారిపోయి వచ్చి వుండడానికి అనువుగా వుండేది వీళ్ళ గది. గదిలో ఒక గోడ నిండుగా మావో చిత్రపటం, ప్రక్కనే చుట్టతో కాస్ట్రో, ప్రక్కన కే.యస్. వీళ్ళకి ఇన్‌స్పిరేషన్. ఆ వయసుకే సమాజంపట్ల ఎంతో అవగాహన వున్నట్లు మాట్లాడుకొనేవారు. రోజూ మావో జీవిత ఘట్టాల మీదా, ఫీడల్ కాస్ట్రో నైతిక బలం మీదా, తెలంగాణా రైతాంగ పోరాటం మీదా వాగ్వివాదాలు, ఘర్షణలూ జరుగుతుండేవి. ఆ ఉద్యమాల చరిత్ర చదువుతున్నప్పుడు 'నేను సైతం ప్రపంచాగ్నికి' అన్నట్టుగా అలా పతితులు భ్రష్టుల బాధా సర్వదష్టులలోకి వెళ్ళి విప్లవాన్ని వాళ్ళ ముంగిట్లోకి తేవాలని యాదగిరి, చెంగారెడ్డి లాంటి వాళ్ళు కలలు కనేవాళ్ళు. ఆ ఉద్రేకం ఎంత తీవ్రంగా వుండేదంటే ఇక ఒక సంవత్సరంలో తెలంగాణా ప్రాంతంలో అంతటా విప్లవం అంటే రె..వ..ల్యూ..ష..న్ వచ్చేందుకు సమాయత్తమైందని, వీరంతా ఆ జగన్నాథ చక్రానికి సారథులు కాబోతున్నారనీ కలలు కాదు నిజంగానే నమ్మేవారు.

ఆ ఉద్వేగంలోనే ఒక 'దళం'లో క్రియాశీల సభ్యులుగా చేరిపోయారు. ఓరోజు పోలీసుల నిఘా తప్పించుకొని ఎల్లెందు దగ్గర దళం ప్రచారం కోసం ఓ గ్రామం చేరారు. పగలంతా కొండల్లో దాక్కొని, రాత్రిళ్ళు ఒక గ్రామం నుండి వేరొక గ్రామానికి ఇద్దరు సీనియర్స్ వెంట ప్రయాణం చేయాలి. "పెడదారులు" తొక్కుతున్న వేరే దళం ప్రభావంలోంచి ఆ గ్రామం వారిని తమ దళంవైపుకి త్రిప్పుకోవడం వీరి రహస్య ప్రణాళిక.

అక్కడ అచ్చక్క అనే క్రియాశీల సభ్యురాలు వుంది. ఆమె ఇంట్లోనే వారి సమావేశం. సమావేశం మొదలు కాక ముందే దళ నాయకుడు ఆమె గురించి వివరించాడు. ఈ శతాబ్దంలో భారతదేశంలో మరే ఇతర ప్రాంతంలోనూ సంభవించని సామాజిక ఒడిదుడుకులకి సాక్షి అయిన తెలంగాణా ప్రాంతపు పీడిత వర్గానికి చెందిన విలక్షణ మహిళ అచ్చక్క చదువూ సంధ్యా లేకపోయినా, అచంచలమైన పోరాట పటిమ ఆమె నొసటిపై ప్రతిబింబించేది. 'మై లైఫ్ ఈజ్ యాన్ ఓపెన్ బుక్' అన్నాడట గాంధీ. 'మై లైఫ్ ఈజ్ యాన్ ఓపెన్ రివోల్ట్' అన్నట్లుండేది అచ్చక్క. సిద్ధాంతాలకంటే బలంగా ఆమె ముఖంలో కన్పించే పోరాట పటిమే విప్లవానికి ముడిసరుకు అనీ, ఆ ముడిసరుకుని విప్లవోన్ముఖంగా మలచుకోవడమే కర్తవ్యమనీ అప్పడే దళ నాయకుడు బోధించాడు.

రహస్య ప్రణాళికను చర్చకు మొదలెట్టగానే కలవరం మొదలైంది. ఒకవైపు నుంచి పోలీసులూ, మరోవైపు నుంచి ప్రత్యర్థి దళం వాళ్ళూ చుట్టుముట్టారని వర్తమానం. ప్రాణాలతో వెనక్కి వెళ్ళడం చాలా కష్టం. భావోద్రేకం అంతా మోకాళ్ళ క్రిందుగా జారిపోగా వళ్ళంతా చెమటలు పట్టాయి యాదగిరికీ, చెంగారెడ్డికీ.

విప్లవాగ్నికీ, భయ విహ్వలతకీ జరిగిన మానసిక పోరాటంలో చివరిగా ట్యాక్టికల్ రిట్రీట్ ( వ్యూహాత్మక వెనుకడుగు) అవసరమని దళ నాయకుడి నిర్ణయం. నిర్ణయించిందే తడవుగా అచ్చక్క ధైర్యంతో, చాకచక్యంతో రహస్యంగా అందరినీ గ్రామం బయటకు పంపగలిగింది. ఆ రోజు జరిగిన ఎదురు కాల్పుల్లో ఆమె కాలికి తీవ్రమైన గాయం కూడా అయింది. అయినా ఆమెను వదిలి ప్రాణాలతో బృందమంతా హైదరాబాద్ బయలుదేరారు.

"ఆ తిరిగి వచ్చిన నెల రోజుల దాకా హైదరాబాదులో రాత్రయిందంటే ఎముకల్లో చలి కొరికేసేదిరా ఎండా కాలంలో కూడా" అన్నాడు యాదగిరి యిద్దరికీ అయిదో పెగ్గు కోసం విస్కీ పోస్తూ.

"నీదేముందిలేరా! నే కూడా ఓ పది రోజుల పాటు బొంబాయి మా అన్న కాడికి పోయుంటిగదా!" చికెన్ అరవై అయిదు ముక్క నోట్లో వేసుకొంటూ అన్నాడు చెంగారెడ్డి.

"ఆ టెన్షన్ క్రయిం సిన్మాలో కూడా ఉండదురా. కుర్రోళ్ళం గాబట్టి సరిపోయింది గాని" అంటూ మరోసారి విస్కీ గుటక మింగాడు యాదగిరి.

x x x

ఆ సంఘటన జరిగిన నెల రోజుల్లోనే యాదగిరి మేనమామ యాదృచ్ఛికంగా అడిక్‌మెట్‌లో వాళ్ళ గదికి చూద్దామని రావటం, గదిలోని పోస్టర్లూ, ఎర్ర పుస్తకాలూ చూసి పరిస్థితి గమనించి యాదగిరి తండ్రికి "నీ కొడుకు చెయ్ దాటి పోయాడు చూసుకో" అని చెప్పటం, తండ్రి వెంటనే ఇంటికి పిలిపించి రెండెకరాల పొలం అమ్మి బెంగుళూర్లో ఇంజనీరింగ్ కోర్సుకి డొనేషన్ కట్టించటం, నెలకి నాలుగు వేల రూపాయిలు విచ్చలవిడిగా ఖర్చు చేయటానికి పంపుతుండగానే తను ఇంజనీరింగ్ పూర్తిచేయటం, గవర్నమెంటు ఉద్యోగం రావడం, పేరు మోసిన కాంట్రాక్టరు కూతురు లక్షల ఆస్తితో సలక్షణంగా అర్ధాంగి కావటం అతని జీవితంలో తర్వాత పేజీలు.

యాదగిరి త్వరలోనే "బయట"పడ్డా చెంగారెడ్డి ఇంకా ఆ "రొంపి"లోనే కొద్ది కాలం ఉండిపోయాడు. ఉద్యమానికి మద్దతుదారులుగా ఉన్న లాయర్ల

## బ్రతుకే ప్రశ్నార్థకమవుతున్న వేళ

కడుపులో మొసళ్ళు నాలుగు స్తంభాల ఆటకు
ప్రారంభోత్సవం తీగ తెగినవుడే మొదలయ్యింది
నవ్వులు బలవంతాన నొక్కేయబడుతున్నాయి
పౌర్ణమి రోజు కూడా మేఘాలు అడ్డువచ్చి
వెలుగును చిదిమేస్తున్నాయి
సమస్యల వడగండ్ల వానకు
హృదయాలు మట్టి పెళ్ళలుగా విరుగుతున్నాయి.
అసలు మొత్తం బ్రతుకే ప్రశ్నార్థకమవుతున్న వేళ
కలల్ని గోనె సంచిలో బంధించి భుజానెత్తుకుని
ఎండిన డొక్కల్ని చదును చేసి
వర్గకుల కసి విత్తనాలను వెదజల్లుతూ
రంగుల నవ్వుల్ని భూమ్యాకాశ గోడలపై వేయించు
ఆదిగో...
ఆకాశంలో ఇవుడే మేఘాన్ని చీల్చుకుని మెరుపు పుట్టింది.

– యుగంధర్

డాక్టర్లూ పౌర హక్కుల వాళ్ళ కనుసన్నల్లో మెలుగుతూ సభలూ సమావేశాలకూ హాజరవుతూ తగినంతగా పరిచయాలు పెంచుకొన్నాడు చెంగారెడ్డి. స్థానికంగా పలుకుబడి పెరుగుతున్న సమయంలోనే ప్రాంతీయ పార్టీ ఏర్పడి అధికారం చెలాయించటానికి అభ్యర్థుల కోసం వేట ప్రారంభించడంతో చెంగారెడ్డికి వెతకబోయిన తీగ చేతికి తగిలినట్లయింది. తుపాకీ గొట్టం ద్వారా రావల్సిన అధికారం సైకిల్ చక్రం ద్వారానో, అభయహస్తం ద్వారానో, అంకుల్ శామ్ టోపీ కుచ్చుల మీదుగానో (అతని గ్రానైట్ ఇండస్ట్రీ అమెరికా, యూరప్ దేశాలకే ఎగుమతి చేస్తుంది) వస్తే మాత్రం తప్పేమిటని సరిపెట్టుకొన్నాడు చాలామంది నేటి ప్రపంచ సామ్యవాద దేశాల నాయకుల్లాగే.

x x x

"ఏమైనా, నీ భవిష్యత్తే బాగా వెలుగొందేట్లుగా ఉందిరా. ఏ రోజైనా మంత్రివి కావచ్చు. లేదా ఏదో కార్పొరేషన్ కుర్చీ కొట్టేయొచ్చు" అమాంతం కుర్చీలో కూలబడుతూ టీపాయ్ మీద కాళ్ళు సారించాడు యాదగిరి.

"నీకు మాత్రం ఏమాయెరా? గవర్మెంటులో ఉండావు. బాగా కనెక్షన్లుండాయి. వెనక పెద్దముండాడు." అన్నాడు చెంగారెడ్డి.

"అరే, అచ్చక్కెలా వుందోరా? ఆ తర్వాత రెండు మూడు రోజులు రాజుగాడు "అచ్చక్కా, అచ్చక్కా" అని కలవరిస్తూనే ఉన్నాడు గదా" గుర్తు తెచ్చుకొన్నాడు యాదగిరి అకస్మాత్తుగా స్పృహలోకి వచ్చినట్లు.

రాజుగాడు మాత్రం ఆ మందిలో బడి అలానే తిరుగుతూండు గదా. పోరాటాలు కాదంట, ఏదో నిర్మాణం చేపట్టాలంట. ఏవేవో చెబ్తా వుండాడు" ఇంకో మిత్రుడు రాజు జీవితంలో అలానే కొట్టుకొంటున్న పేజీలను అలా, అలా త్రిప్పాడు చెంగారెడ్డి.

ఓ సారలా వెళ్ళి అచ్చక్కని చూసొద్దామేంరా" టీపాయ్ మీద నుంచి కాళ్ళూ, కుర్చీ మీద నుంచి తలా జారిపోతున్నా ఏదో అంటున్నాడు యాదగిరి. అంతలో క్రింద కారు చప్పుడయింది. మెట్లెక్కి పైకి వస్తున్నాడు యశ్వంతరావు. చిరాగ్గా వున్నట్లున్నాడు.

కుర్చీలో కూర్చొని వళ్ళు విరుచుకున్నట్లుగా పైకెత్తి "యాద్గిరన్నా, కొంచెమన్నా ఉంచినావా నా కొరకు? లేపోతే తెప్పించి పుణ్యం కట్టుకోన్నా" బ్రతిమాలాడు యశ్వంతరావు.

"నాలుగు చోట్ల బిల్డింగులు కడ్తా వుండావు. నువ్వు బిల్డింగ్ చెయ్యాల్నే గాని అమృతం కావాలంటే తెప్పించమా?" అన్నాడు కిక్కు కంట్రోల్ చేసుకుంటూ చెంగారెడ్డి.

"ఏం బిల్డింగన్నా, రోజూ ఏదో కిరికిరైతనే ఉంటదన్నా. ఇప్పుడు జూడు. ఏదో ముసల్ది దూలం పడి చచ్చిందంట. అదే చావు బతుకుల మధ్య నుందట. లంగర్ హౌస్ ఎపార్ట్‌మెంట్ల గిట్లనె అయితే 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని యూనియనోళ్ళు పట్టుపడ్తా వుండారన్నా. గిట్లయితే ఏం గట్టిస్తం?" వాపోయాడు యశ్వంతరావు.

"ముసల్దంటున్నావు" బిల్డింగ్‌ల పనికి ఎక్కనికి దిగనికే సరిపోతది గదా, ముసల్దాన్ని ఎట్ల పన్లో బెట్టినావన్నా' ' అనడిగాడు, అచ్చక్క చివరికి అక్కడికి ఎలా చేరిందో అర్థంకాని చెంగారెడ్డి ఏమీ తెలియనట్లు.

"అదో పెద్ద కత లేన్నా. ముసల్దయినా మహా నాయకురాలన్నా. రెండు మూడూళ్ళ కూలోళ్ళు ఆ ముసల్దాని మాట మీద నడుస్తరన్నా" అంటూ ఏదో పొరపాటు చేసి ఇరుక్కుపోయిన వాడిలా అసహనంగా గ్లాసులో మొత్తం విస్కీని ఒకే గుటకలో లాగించాడు.

నిజానికి పెద్ద కథేం లేదు. అప్పట్లో యశ్వంతరావు ఆ గ్రామాల్లో కూలీ సంఘాల్లో తిరుగుతుండేవాడు. అక్కడి వాళ్ళతో పడక హైదరాబాదు వచ్చేసి మల్కాజిగిరీ ప్రాంతంలో స్థానిక గూండాగా నిలదొక్కుకున్నాడు. కబ్జా చేసిన భూముల విలువ పెరగడంతో పెద్ద మనిషైపోయాడు. నమ్మకమైన పనివాళ్ల కోసం ఆయా గ్రామాల్లో తిరిగి, కాల్పులకీ ఎదురు కాల్పులకీ, ఘర్షణలకీ విసిగి వేసారిపోయిన అచ్చక్కలాంటి కూలీలను హైదరాబాదు తెచ్చి పని చేయించడం మొదలుపెట్టాడు. అచ్చక్క మాట మీద ఇందరు కూలీలు ఇక్కడకు వచ్చి పనిచేయడం వల్ల, ఆమెకే దయినా అయిండంటే అందరూ గొడవ చేస్తారనే భయంతో అతను అసహనంగా వున్నాడు. పెగ్గు మీద పెగ్గులాగిస్తున్నాడు.

"ఏందన్నా, మంచి టెన్షన్ మీదుండట్లుండావే. మరీ పాస్టుగా లాగిస్తే కక్కేస్తావన్నా" అన్నాడు యాదగిరి.

" నేను ఈ రోజు నిజానికి మందు గొట్టానికి రాలేదన్నా. ఇది రెండు కోట్ల ప్రాజెక్టన్నా, ఇంకా కార్పొరేషనోళ్ళు, రిజిస్ట్రేషనోళ్ళు పర్మిషన్ ఇయ్యకుండా పరేశాన్ చేస్తూ వుండరు. ఎంత లంచమిచ్చినా దొంగనాకొడుకులు ఫైలు మీద బైఠాయించి లేవట్లేదన్నా. ఇంతలో ఈ ముసల్ది చచ్చిందంటే... ఈ పాటికే పోలీసోళ్ళు నా మీద కత్తి గట్టి ఉండారు. పెద్ద కేసై పనాగిపోతదన్నా. ఇక దివాళా దియ్యాల్సిందేనన్నా."

"ఏం చేస్తావన్నామరి?"

"అందుకే వచ్చినా గదా యాద్గిరన్నా. నువ్వు మీమామతో కార్పొరేషన్‌లో జెప్పించన్నా. చెంగారెడ్డి జర హోం మినిష్టర్ పేషీ నుంచి పోన్ గొట్టిస్తే సరిపోతదన్నా. మిగతాది నేజూసుకొంటా. ఈ ముసల్దాని బారి నుండి నన్ను కాపాడండన్నా"

పెద్దఆదర్శంగా తను భావిస్తున్న యశ్వంతరావు అంత బలహీనంగా మాట్లాడుతుంటే యాదగిరి చలించిపోయాడు. మత్తంతా దిగిపోయినట్లయింది.

"ఒద్దన్నా – పెద్దోడివి. నువ్వు డీలా పడిపోతే ఎట్లా. ఇప్పడే మా మామకి ఫోన్ జేస్తానుండు" అంటూ లేచాడు.

అప్పటికే సీసాలు, ప్లేట్లు ఖాళీ అయిపోయాయి.

చంగారెడ్డి కూడా ఇంటికెళ్ళి మినిష్టర్‌కి ఫోన్ చేస్తానని బయలుదేరాడు.

ఇద్దరికీ షేక్ హ్యాండిచ్చి యశ్వంతరావు కారెక్కుతున్నాడు. గేటు వేసి లోపలికి వస్తుంటే యాదగిరికి సడగా హాస్పిటల్‌లో శవంగా మారబోతున్న అచ్చక్క గుర్తొచ్చి కడుపులో దేవినట్లయింది.

ఎక్కువగా త్రాగిన విస్కీతో బాటు, ఎక్కడో తప్పు చేస్తున్నానన్న తన గిల్టీ ఫీలింగ్‌ను కూడా వాష్ బేసిన్‌లో భళ్ళున కక్కేసి, ముఖం కడుక్కొని మత్తుగా నిద్రపోయాడు.